

షాద్‌నగర్‌లో మొదటిసారి ఓటేసిన యువతి



ఆమనగల్లులో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

# సజావుగా పోలింగ్

**రంగారెడ్డి జిల్లాలో ఓటింగ్ కోసం పోటెత్తిన గ్రామీణులు**

**పోలింగ్ సమయం తర్వాత కూడా**

**క్యూలైన్లలో బారులు తీరిన ఓటర్లు**

**సొంతూర్లలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు**

రంగారెడ్డి, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు గురువారం జరిగిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. హైదరాబాద్ నుంచి పల్లెలకు వెళ్లేందుకు ఓటర్లు క్యూ కట్టడంతో ప్రధాన రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. మంత్రి సబితా ఇందారెడ్డితోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు మంచి రెడ్డి కిషన్‌రెడ్డి, కాలె యాదయ్య, అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్‌లతో పాటు పలువురు ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించారు. కలెక్టరేట్ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ హోలీకేరీ పర్యవేక్షించారు. ఎన్నికలు సజావుగా ముగిసినట్లు అధికార యంత్రాంగం పేర్కొన్నది.

**పోటెత్తిన గ్రామీణులు..**

జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో గురువారం జరిగిన ఓటింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. ఉదయం పోలింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచే ఓటర్లు పోలింగ్ స్టేషన్ల వద్ద బారులు తీరడం కనిపించింది. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా ఓటర్లు పెద్ద ఎత్తును తరలిరావడంతో కేంద్రాలు కిటకిటలాడాయి. పోలింగ్ సమయం ముగిసే సమయానికి కూడా ఓటర్లు పెద్ద సంఖ్య క్యూ లైన్లలో కనిపించారు. దివ్యాంగులు, మహిళల కోసం ప్రతి నియోజకవర్గంలోనూ మాడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నీటి వసతి, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచారు.

**ముగిసిన ఎన్నికలు**

జిల్లా వ్యాప్తంగా 3,453 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా ముగిశాయి. ఎన్నికల విధుల్లో మైక్రోఅబ్జర్వర్లు 283 మంది, పీవోలు 3,803 మంది, ఏపీవోలు 3,803, ఓపీవోలు 7,606లు కలుపుకుని మొత్తం 15,212 మంది విధులు నిర్వర్తించారు. పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ మొదలై సాయంత్రం 5 గంటలకు ముగిసింది. సాయంత్రం 5 గంటలలోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఓటింగ్ సరళిని కలెక్టర్ హోలీకేరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు.



మంచాల మండలం రంగాపూర్‌లో పోలింగ్ బూత్‌కు వస్తున్న వృద్ధురాలికి సహాయం చేస్తున్న పోలీసు సిబ్బంది

**ఓటు వేసిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి తన స్వగ్రామం అయిన చేవెళ్ల నియోజకవర్గంలోని కౌకుంట్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తన సొంతూరు ఎలిమినేడులో, చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య నవాబుపేట మండలంలోని చించల్‌పేట్‌లో, కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ తన సొంతూరు అయిన కడ్తాల్ మండలంలోని చల్లంపల్లిలో, షాద్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్ తన స్వగ్రామం ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, టీటీడీ డైరెక్టర్ సీతారెడ్డి మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ క్యామ మల్లేష్ శేరిగూడలో ఓటు వేశారు. కలెక్టర్ హోలీకేరి జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సినీ నిర్మాత బండ్ల గణేష్ షాద్‌నగర్ పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సినీ నటుడు బిత్తిరి సత్తి చేవెళ్ల నియోజకవర్గంలోని పామెన గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు

పోలింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపర్చారు. జిల్లాలో ఓటింగ్ కోసం 5,488 కంట్రోల్ యూనిట్లు, 9,943 బ్యాలెట్ యూనిట్లు, 5,389 వీవీప్యాట్లను వినియోగించారు. పోలింగ్ ప్రక్రియ ముగియగానే ఎన్నికల సిబ్బంది ఈవీఎంలను డిస్ట్రిబ్యూటరీ సెంటర్లకు తరలించి అక్కడి నుంచి పోలీసు భద్రత మధ్య స్ట్రాంగ్ రూములకు తరలించారు. ముందుగా ఖరారు చేసిన రూట్లలో గురువారం రాత్రి సమయానికి పకడ్బందీగా స్ట్రాంగ్ రూములకు చేర్చారు. స్ట్రాంగ్ రూముల వద్ద 144 సెక్షన్‌తోపాటు మూడంచెల భద్రత విధానాన్ని ఏర్పాటు చేశారు. తొలి అంచెలో పారా మిలిటరీ, రెండో అంచెలో సాయుధ సిబ్బంది, మూడో దశలో సివిల్ పోలీసులు భద్రతా విధుల్లో ఉంటారు. అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ఫైరింజన్లను అందుబాటులో ఉంచారు. డిసెంబరు 3న జిల్లాలోని ఏడు చోట్ల ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు.

## సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలు

జిల్లాలో 1,541 సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తును చేపట్టారు. 2,990 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా, మరో 822 కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచారు. ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్ పల్లి, మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గం చౌదరిగూడ మండలంలోని కాస్లాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ నేతలు కొందరు దాడి చేయగా, బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



షాద్‌నగర్‌లో ఎంఈవో కార్యాలయం పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

## ఏ సమయానికి ఎంత పోలింగ్

**ఉదయం 9 గంటలకు 2,77,859(7.88 శాతం)**

ఇబ్రహీంపట్నం -26,567(8.11 శాతం), ఎల్బీనగర్-33,248(5.6 శాతం), మహేశ్వరం-27,329(5 శాతం), రాజేంద్ర నగర్-87,291(15 శాతం), శేరిలింగంపల్లి-58,600(8 శాతం), చేవెళ్ల-15,720(6 శాతం) , కల్వకుర్తి-12,088(5 శాతం), షాద్ నగర్-17,016(7.2 శాతం)

**ఉదయం 11 గంటలకు 5,92,909(16.83 శాతం)**

ఇబ్రహీంపట్నం -68,727(20.98 శాతం), ఎల్బీనగర్-66,377(11.18 శాతం), మహేశ్వరం-70,126(12.83శాతం), రాజేంద్రనగర్-1,00,268 (17.23శాతం), శేరిలింగంపల్లి- 1,54,193(21.05 శాతం), చేవెళ్ల-47,161(18 శాతం) , కల్వకుర్తి-43,517(18 శాతం), షాద్ నగర్-42,541(18 శాతం)

**మధ్యాహ్నం 1 గంటకు 10,43,032(29.61 శాతం)**

ఇబ్రహీంపట్నం -1,28,183(39.13 శాతం), ఎల్బీనగర్-1,42,788(24.05 శాతం), మహేశ్వరం-1,81,245(33.16 శాతం), రాజేంద్ర నగర్-1,36,755(23.5 శాతం), శేరిలింగంపల్లి-2,07,299(28.3 శాతం), చేవెళ్ల-77,291(29.5 శాతం) , కల్వకుర్తి-95,496(39.5 శాతం), షాద్ నగర్-73,974(31.3 శాతం)

**మధ్యాహ్నం 3 గంటలకు 14,94,440(42.43 శాతం)**

ఇబ్రహీంపట్నం -1,80,400(55.07 శాతం), ఎల్బీనగర్-2,17,477(36.63 శాతం), మహేశ్వరం-2,15,734 (39.47 శాతం), రాజేంద్ర నగర్-2,00,768(34.5 శాతం), శేరిలింగంపల్లి-2,80,916(38.35 శాతం), చేవెళ్ల-1,17,247(44.75 శాతం), కల్వకుర్తి-1,45,081(60.01 శాతం), షాద్ నగర్-1,36,816(57.89 శాతం)

**సాయంత్రం 5 గంటలకు 18,67,789(53.03 శాతం)**

ఇబ్రహీంపట్నం-2,08,670(63.70శాతం), ఎల్బీనగర్-2,58,799(43.59శాతం), మహేశ్వరం- 2,90,451(53.14 శాతం), రాజేంద్ర నగర్-2,57,798(44.30 శాతం), శేరిలింగంపల్లి-3,55,998(48.60 శాతం), చేవెళ్ల-1,67,421(63.90 శాతం) , కల్వకుర్తి-1,54,849(64.05 శాతం), షాద్ నగర్-1,73,803(73.54 శాతం)

## జిల్లాలో పోలింగ్ 59.96శాతం

'రంగారెడ్డి జిల్లాలోని 8 అసెంబ్లీ స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 35,23,219 మంది ఓటర్లు ఉండగా పోలింగ్‌లో 59.96శాతం మంది తమ ఓటు హక్కును తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లు వేసేందుకు జనం బారులు తీరారు. యువత, మహిళలు, వృద్ధులు సైతం ఓపికగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. రాజకీయ పార్టీల నేతలు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించుకునే ఏర్పాట్లు చేయడం, వాహనాల్లో వారికి కేంద్రాలకు చేరవేయడం వంటివి చేయడంతో ఓటింగ్ శాతం పెరిగింది. ఎన్నికల బరిలో 209 మంది ఉండగా..డిసెంబరు 3న జరిగే కౌంటింగ్‌లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.'



| నియోజకవర్గం | | ఓటింగ్ శాతం |
|---|---|---|
| ఇబ్రహీంపట్నం | - | 74.82 |
| ఎల్బీనగర్ | - | 49.11 |
| మహేశ్వరం | - | 55.33 |
| రాజేంద్ర నగర్ | - | 55.83 |
| శేరిలింగంపల్లి | - | 48.85 |
| చేవెళ్ల | - | 74.25 |
| కల్వకుర్తి | - | 83.23 |
| షాద్ నగర్ | - | 81.96 |